# సుశీల కథలు

జీవియస్

# పులులూ అమాయకురాలూ

మిత్రమండలితో కలిసి మావారు పాఖాల్ అడవికి విహారయాత్రకు వెళ్లారు. పగలంతా రామప్పగుడి శిల్పాలనూ, పాఖాల్ సరస్సు ప్రకృతి సౌందర్యాన్నీ దర్శించి రాత్రికి అడవిలోకి పోయి పులినీ, వన్య మృగాలనూ చూడాలని వారి ప్లాను.

మధ్యాహ్న రాత్రి భోజనాలకోసం ఒక్కొకరూ ఒక్కొక వంటకాన్ని ఇంట్లో చేయించుకొని క్యారియర్లలో తీసుకుపోయారు. మా వంతు 'పులిహోర'. ఆవపెట్టి చేసిన మా పులిహోర వాసన వ్యానంతా గుబాళించింది. 'సుశీలగారి పులిహోర తిని పులులతో కూడా యుద్ధం చేయగలం' అంటూ మిత్రమండలి హుషారుగా ముందుకు సాగింది.

ఇంటిపనులూ, వంట పనులూ ముగించుకుని మాకు పుట్టబోయే పసికందు కోసం వులెన్ స్వెట్టర్ అల్లుతూ వరండాలో కూర్చున్నారు.

సుభాషిణి వచ్చింది. తనను పరిచయం చేసుకుంది. మావారు రాసిన ఒక వ్యాసాన్ని ఫెయిర్ చేసి తీసుకుని వచ్చింది. ఆమె యింటాయన పేరు సౌజన్యారావట! బ్యాంకులో ఆఫీసరుగా పనిచేస్తారట. వాళ్లకు ఇద్దరు పిల్లలట. అయినా ఆమెకు చదువుకోవాలనే ఆసక్తి తగ్గలేదట. కాలేజీలో చేరి బి.ఎ. చదువుతోందట. ఆమె ఆప్షనల్ తెలుగట. మావారి ఉపన్యాసమంటే ఆమెకెంతో యిష్టమట. ఒక్కోసారి అన్నం తినకుండా కూడా తెలుగు క్లాసుకు వచ్చేదట. ఆమెకు మావారు అభిమాన హీరోలాంటి వారట. ఆయనకు ఏ విధంగా ఉపయోగపడినా ఆమె జన్మ సార్థకమౌతుందట. మావారిలాగా రాయాలనీ మాట్లాడాలనీ ఆలోచించాలనీ ఆమె ఆశయమట! అందుకే ఆ వ్యాసం ఫెయిర్ చేసిందట.

మావారి దస్తూరీ బాగానే ఉంటుంది. మరి ఈమె సాయమెందుకో తెలియలేదు. మావారి చేష్టల్లో ఏదో కిటుకు ఉంటుంది. అది అందరికీ తెలియదు.

పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయం పాఠం చెప్పారట మావారు. అందులో అయిదు రకాల జంటల ప్రేమ మనస్తత్వాలను విశ్లేషించి వివరించారట. అది ఆమెకు ఎంతో నచ్చిందట. సరస్వతీ చతుర్ముఖులది ప్రతిభాపూర్ణమైన ప్రణయంట! కలభాషిణీ మణికంధరులని బింబ ప్రతిబింబభావ ప్రణయంట. ఈ రెండూ ఆమె హృదయానికి చాలా దగ్గరివట. మావారు ఆ ప్రణయ పద్ధతులు చెప్పిన వైఖరి ఆమెను వశం చేసుకుంది. ఆనాటి నుంచి ఆమెకు మావారి మీద కలిగింది భక్తియో, రక్తియో, ఆసక్తియో ఏమీ తేల్చుకోలేని ఏదో అవ్యక్తమైన మానసిక స్థితిలో ఊగిసలాడుతూ ఉన్నదట.

అడిగితే మారు పల్కుతుంటారు కొందరు. అడిగే అవకాశం కలిగించకుండానే కుండపోతగా మాట్లాడేవాళ్లు కొందరు. సుభాషిణి మాటలు జలపాతాలు.

''కళా పూర్ణోదయంలో కలభాషిణి అపూర్వ పాత్ర. అందంగా ఉండే క్లాస్‌మేట్ మణికంధరుణ్ణి మనసారా వలచింది. కాని, గురువుగారైన నారద మహర్షి శపిస్తాడేమోనన్న భయంతో ఆ కోర్కెను అణచుకుంది. చదువు ముగిసింతరువాత రంభ మొగుడు నలకూబరునిలో మణికంధరుని పోలికలు చూచి అతన్ని పొందాలని పడరాని పాట్లు పడింది. వేషాలు మార్చింది, తబ్బిబ్బుల ప్రహసనంలో తికమకలు పడింది. చివరకు నలకూబరుని వేషంలో ఉన్న మణికంధరుణ్ణి రంభ



రూపంలో పొందింది. ఆ ప్రబంధాన్ని నవలగా మార్చి మాస్టారే చెప్పాలి''

''మాస్టారి ఉపన్యాసం విన్న తర్వాత ఒంటరిగా వారిని కలిసి నా ఆనందాన్ని తెలియచెప్పుకున్నాను. వారు సంతోషించి 'కళాపూర్ణోదయ కలభాషిణి ఓరుగల్లులో సుభాషిణిగా పుట్టినట్లుంది. కలభాషిణీ కళారూపమైన సుభాషిణికి అభినందన'లంటూ నన్ను మెచ్చుకున్నారు''.

''ఆ ఉపమానం మీకు నచ్చిందా?'' నా వంకర ప్రశ్న.

''ఆ ఉపమానం నా జీవితానికి ఒక అద్దం లాంటిది సుశీలగారూ! మాస్టారికి నా చరిత్ర తెలియదు. అయినా, తెలిసినట్లు మాట్లాడారు. నన్ను గురించి నేను సమీక్షించుకోటానికి ఒక కొత్త కవాటం తెరిచారు. మాస్టారు నిజంగా ద్రష్టలు''

''ఆయన మిమ్మల్ని బాగా ఉత్తేజపరిచినట్లున్నారు'' నా యికిలింపు.

''వాడిపోయిన ఒక ఆశా కుసుమానికి ఆయువు పోశారు. మరుగుపడిన ఒక మధుర భావానికి మరలా ప్రాణం పోశారు. కరిగిపోయిన కలల్ని మరలా నాకనురెప్పలకు తోరణాలుగా కట్టారు'' ఆమె కళ్లెందుకో చెమ్మగిల్లాయి. మాట జీరబోయింది.

నేనామె పక్కకుపోయి కూచున్నాను. ఆమె బుజంమీద చేయివేసి లాలనగా అడిగాను. ''మావారు మీ మనసులోని గాయాలమీద కారం చల్లినట్టున్నారు''

''సుశీలగారూ! నాది గాయంవలన కలిగిన బాధ కాదు. తీరని కోరిక చెలరేగటం వల్ల కలిగిన తియ్యని మూగబాధ'' ఆమె బావురుమన్నట్లు పలికిందామాటలు.

నేను ఇరకాటంలో పడ్డాను. ఆమె పడుతోంది బాధో, విరహమో అర్థంకాని అయోమయంలో చిక్కుకున్నాను. ఆమెను చూస్తే ఒక వైపు జాలివేస్తోంది, మరో వైపు భయంకూడా వేస్తోంది. నన్ను పట్టించుకోకుండానే ఆమె తనకథ సాగిస్తూ ఉంది.

''నాకొక మేనబావ ఉన్నాడు. అతనంటే నాకెంతో యిష్టం. చిన్నప్పుడు మేమిద్దరం మొగుడూ పెళ్లాలాట ఆడుకున్నాం. ఎన్నోసార్లు బొమ్మల పెళ్లిళ్లు చేసుకున్నాం. మంచాల వెనుక ముద్దుల కాపురాలు సాగించాం. వయసొచ్చిన తర్వాత కూడా మేమిద్దరం భార్యాభర్తలమౌతామనుకున్నాం. కాని, పెద్దల మాటల పట్టింపులవల్ల మా పెళ్లి చిట్లిపోయింది. నేను సౌజన్యారావు భార్యనైనాను. మా బావ ఆత్మహత్య చేసుకున్నాడు. మావారు లెక్కల మనిషి. నేను కలలపక్షిని. మా యిద్దరి అభిరుచులూ ఉత్తరదక్షిణ ధ్రువాలు. నేను కొత్తగా కాపురానికి వచ్చినప్పుడు కళ్లు మూస్తే నా బావ, కళ్లు తెరిస్తే మావారు లాగా కొన్నేళ్లు గడిచాయి. పిల్లలు పుట్టింతరువాత నా బావ కలలు మరుగునపడ్డాయి. పిల్లల కలలు మొలకలెత్తాయి.

''ఇవన్నీ నాకెందుకు చెబుతున్నారు?'' నా అడ్డు ప్రశ్న.

''నాలాగా కలలుకనే కళ్లు మీకుంటే నాబాధ తెలుస్తుంది''

''నాకంటె మీ మాస్టారు కలలు బాగా కంటారు''

''ఆయనకు చెప్పుకునే ధైర్యం లేకనే మీ దగ్గరికొచ్చాను. వచ్చే ముందు మీగురించి మాస్టార్ని అడిగాను. మీరు అమాయకురాలట! అందుకే మీరు వారికి ఆరవ ప్రాణంట! నన్నొకసారి మిమ్మల్ని తప్పకుండా కలవమన్నారు. స్నేహం చేయమన్నారు''

''ఆయన అమాయకుడని చెప్పుకోటానికి ఇదొక అర్థాలంకారమేమో'' నా కొంటె వ్యాఖ్య.

''మాస్టారు అమాయకుడేం కారు. అన్నీ తెలిసిన వారు. సరస్వతీ చతుర్ముఖుల ప్రణయాన్ని వ్యాఖ్యానింపగలిగారంటే మీరు కూడా ఆయనంతటి వారై ఉండి ఉండాలి. యు ఆర్ యాన్ ఇంటలెక్చువల్ కంపానియన్ టు హిం''

''నాకు మీ మాస్టారు ప్రబంధాలు పాఠాలు చెప్పలేదు.

అందువలన నాకు శృంగార భేదాలు తెలియవు. నేను నిజంగా ఆ రంగంలో అమాయకురాలినే''

''ప్రబంధ స్త్రీలు కూడా మనలాంటి వాళ్లే. కలభాషిణికీ నాకూ పోలికలున్నాయ్. నేను ఒక రూపాన్ని మొదట ప్రేమించాను. అది జీవితంలో నాకు లభించలేదు. కాని, ఇప్పుడు నేను ప్రేమించిన ఆ రూప సామ్యం మాస్టారిలో అచ్చుగుద్దినట్లుగా కనపడుతోంది. నాలోని వాడిపోయిన వాసనలు మరలా గుబాళిస్తున్నాయి. కాని, మాస్టారు నా గురువు, వివాహితులు. అందుకే మథనపడుతున్నాను. మాస్టారు నాలో ఒక ఆశాజ్యోతిని వెలిగించారు. వెనువెంటనే ఒక నిరాశను కూడా మిగిలించారు''

''మీ సంగతి మీ మాస్టారికే ముఖాముఖి చెప్పుకుంటే మీకు నిరాశమిగలకుండా ఏదైనా ఉపాయం సూచిస్తారేమో'' నా ఓదార్పు మాట.

''ఆ ఉపాయం మీ దగ్గరే ఉందని నా నమ్మకం. నేను మాస్టారులో నా ప్రణయమూర్తిని చూచు కుంటు న్నానన్న సంగతి మీ మనసులోనే దాచండి. నేను మాస్టారిని శరీరంతో కోరటం లేదు. మేధతో ప్రేమిస్తున్నాను. నాకు వారి ప్రతిభతో, కళతో సాహచర్యం కావాలి. వారి సాహితీ మూర్తికి నేను ప్రతిబింబం కావాలి. అందుకని వారితో సన్నిహితంగా హితంగా మసలుతూ ఉంటాను. మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు. మాస్టార్ని అనుమానించవద్దు''

నాకు మనసులో చిమచిమలాడటం మొదలైంది. గొంతు గరగరలాడింది.

''మగబింబానికి అద్దంలో ఆడ ప్రతిబింబం కనపడుతుందా?''


''కళాప్రతిబింబాలలో ఆడామగా అనే తేడా ఉండదు''

''మీ ఆశయాన్ని గురించి మీవారికి చెప్పారా?''

''ఆయనకు చెప్పినా అర్థంకాదు. ఒకవేళ చెప్పాననుకోండి... పులిలా నామీదపడి చంపేస్తాడు''

''మరి మావారికి మీ విషయం తెలిస్తే నన్ను పులిలాగా చంపెయ్యరా?''

''మీరు రహస్యంగా ఉంచుతారనే మిమ్మల్ని అడుగుతున్నాను''




''మావారితో మీ ఇంటలెక్ట్యువల్ కంపానియన్‌షిప్‌కు లైసెన్సు అడుగుతున్నారా నన్ను?''


''లైసెన్సు లేకుండానే నడిపే వ్యాపారాలెన్నో ఉన్నాయి సుశీలగారూ! నేనూ మీలాంటి యిల్లాలినే. ప్రతిభాపూర్ణమైన స్నేహానికి పాపం లేదు. మీకేమీ ఇబ్బంది ఉండదు.''

''మీవారి అంగీకారంతో మావారు సరేనంటే నాకేం అభ్యంతరం లేదు. నేను అమాయకురాలిని''

మా యిద్దరిమధ్యా ఒక్క క్షణం నిశ్శబ్దం.

అంతలో గేటు దగ్గర అలికిడి వినిపించింది. ఒక పది మంది విద్యార్థులు మా వరండా ముందుకు వచ్చారు. మావారు లేరని తెలుసుకుని తెల్లబోయి ఒకరిమొగం ఒకరు చూచుకున్నారు. వారందరిలో ఎత్తుగా ఉన్న ఒక విగ్రహం ఇన్‌షర్ట్ వేసుకుని ఉన్నాడు. ఆరడుగులున్నా అతని ముఖంలో పసితనం దోబూచులాడుతోంది.




చేతిలో ఒక పూలకొమ్మను వొయ్యారంగా కదిలిస్తూ నించున్న అతని వైఖరి సిగ్గుయెగ్గులేని విలన్ లక్షణాలను ప్రకటిస్తున్నా కన్నుల్లో ఒక విషాదచ్ఛాయ కమ్ముకుని వుంది. అయినా అతడొక గాంగ్ లీడర్‌గా కనపడుతున్నాడు. అతడు సుగ్రీవుడులా ఆజ్ఞాపిస్తున్నాడు.

''సార్‌కు చెప్పే మాటలు మాడమ్‌కు చెప్పండి. ఆమే సార్‌ను దారిలో పెడుతుంది. లేకపోతే త్యాగరాజు తడాఖా ఏమిటో చూపించాల్సి వస్తుందని చెప్పండి'' అతని మాటల్నిబట్టి అతని పేరు త్యాగరాజని తెలిసింది.

''మేడమ్! మేమందరం సార్ రాసిన నాటకంలో పాత్రధారులుగా ఎన్నికైన కాలేజీ విద్యార్థులం. ఆ నాటకం విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు నిర్వహించే అంతర్విశ్వ విద్యాలయ నాటకాల పోటీలో ప్రదర్శించాలని సార్ నిర్ణయించారు. అయితే, అందులో హీరోగా త్యాగరాజు నటించాలని ఉత్సాహపడుతున్నాడు. సార్ దానికి సుముఖంగా లేరు. అయిదారు సార్లు అడిగాం. అయినా లాభం లేకపోయింది. రేపు రిహార్సల్స్ మొదలుకాబోతున్నాయి. దానికి మా నిరసన తెలపటానికి వచ్చాం మేడమ్'' ఒక విద్యార్థి వినయంగానైనా వాడిగానే చెప్పాడు హెచ్చరిస్తున్నట్టు.

''త్యాగరాజుకు ఏ పాత్రా ఇవ్వలేదా?'' నా ప్రశ్న.

''సైడ్ హీరో పాత్ర యిచ్చారు. జట్కావాలా పాత్ర. విలన్ పాత్ర. హనుమకొండలో యింత బతుకు బతికి ఈ పాత్రా నేనేసేది? ఏమైనా నాకు హీరో పాత్ర యివ్వాల్సిందే. లేకపోతే నాటకం రైలెక్కదు. రక్తం కళ్ల చూస్తుంది. మీరు సార్‌కు చెప్పండి. నేను హీరో కావాలి. లేదా నాటకం ఆగిపోవాలి'' త్యాగరాజు పులిగాండ్రించినట్లు ధిక్కారంగా మాట్లాడాడు.

నేను ప్రశాంతంగా ''నీవు నాటకంలో హీరో కావాలనుకుంటున్నావా? సినిమాల్లో కూడా నటించాలనుకుంటున్నావా?'' అన్నాను.

''నాటకంలోనే గతిలేదు. ఇక సినిమాల్లోనా?'' త్యాగరాజు వెటకారం.

''త్యాగరాజూ! నీవు నాకు తమ్ముడిలాంటి వాడివి. నీ మేలుకోరి నేనొకమాట చెబుతాను విను. కొద్ది రోజుల క్రితమే ప్రసిద్ధ సినీ విలన్ ఆర్.నాగేశ్వరరావు దివంగతుడయ్యాడు. అతని స్మృతులు ఆంధ్రుల హృదయాల్లో ఇంకా చెరిగిపోలేదు. నీలో ఆయన పోలికలు కొన్ని ఉన్నాయి. నిన్ను ఆర్.నాగేశ్వరరావు మేకప్‌లో జనం చూశారంటే ఎగబడి అభినందిస్తారు. విశాఖపట్నం నించే టిక్కెట్టుకొని పంపి మద్రాసు సినీరంగానికి నిన్ను అంకితం చేస్తారు. సినిమాల్లో ఛాన్సు కావాలంటే సార్ చెప్పిన పాత్రను అంగీకరించు. కష్టపడి అభినయించు, నటనకు చిన్న పాత్రనీ, పెద్ద పాత్రనీ ఉండదు. దొరికిన దానిని పాడుచేసుకోకుండా భవిష్యత్తుకు మెట్లు కట్టుకో... క్రమంగా తారాపథానికి ఎక్కిపో''

నా మాటలు త్యాగరాజుమీద మత్తుమందులా పనిచేశాయి. అతని కళ్లు వింతగా గుండ్రంగా తిప్పాడు. ముక్కెగరేస్తూ వింతనవ్వు నవ్వాడు. చిత్రసీమలో తన భవిష్యత్ చిత్రం కనపడినట్లుంది. చల్లబడి మెల్లగా మాట్లాడాడు.

''మాడమ్! ఈ నాటకం మీరే రాశారా? మా సెలెక్షన్ కూడా మీరే చేశారా?'' అని అమాయకంగా ప్రశ్నించాడు త్యాగరాజు. నేను పెద్దగా నవ్వాను.

''త్యాగరాజూ! నీవు సినిమాల్లో చేరింతర్వాత మళ్లీ కనపడు. సంతోషిస్తా''

త్యాగరాజు చేయెత్తి తన మిత్రమండలిని సైగ చేశాడు. వెనుదిరిగి వేగంగా అంగలు వేసుకుంటూ నడిచాడు. అడివిలో పులి ముందు వెళ్తుంటే పులిపిల్లలు వెంట నడిచినట్టు విద్యార్థులందరూ అతన్ని అనుసరించారు.

అంతవరకూ కళ్ళొప్పగించి చూస్తున్న సుభాషిణి లేచి నా చేతులు పట్టుకుంది. ''త్యాగరాజంటే మా కాలేజీలో అందరికీ హడలు. అతన్ని మీరు పిల్లాడిలా చేసి పల్టీ కొట్టించారు. అబ్బో! మీరు సామాన్యురాలు కాదు. మా గురువుగారికే గురువుగారు'' అంటూ ప్రశంసల వర్షం కురిపించింది.

''మీ మాస్టారు పులుల మధ్యనే తిరుగుతూ పులులను ప్రత్యేకంగా చూడటానికి పాఖాల్ అడవికెందుకు పోయారో నాకర్థం కావటం లేదు''

''ఇవి ఇమిటేషన్స్ అవి ఒరిజినల్స్'' సుభాషిణి సూక్తి.

''బింబాలకంటె ప్రతిబింబాలే బాగుంటాయంటారుగా మీ సాహితీ వేత్తలు''

''మీరు నేననుకున్నంత అమాయకురాలు కారు సుశీలగారూ!''

''మీరందరూ వాడుతున్న 'అమాయకురాలు' అనే పదానికి ఎన్ని అర్థాలుంటాయో కూడా తెలియని అమాయకురాలిని నేను. ఒక యిల్లాలు మరో ఇల్లాలికి ఇవ్వలేని లైసెన్సును అరమరికలు లేకుండా అడిగే అమాయకురాలు మీరు. ఏమైనా ఇల్లాలు పొందే ఒక రకమైన జీవితకళామర్మాన్ని నాకు తెలియచెప్పారు నామీది నమ్మకంతో. కృతజ్ఞురాలిని. నేను మీమీద నమ్మకంతో ఒకమాట చెపుతున్నాను. ప్రబంధ పాత్రలకు మనం ప్రతిబింబాలం కాలేము. కాని, ప్రబంధానికీ ప్రపంచానికీ మనం పూలవంతెన కట్టవచ్చు. అలనాటి కలభాషిణివంటి ఈనాటి సుభాషిణికి నా నమస్కారం'' అని వీడ్కోలు చెప్పాను.

నోటికందిన వేట జారిపోయిన చిరుతపులిలా చిత్రంగా వెనక్కు చూస్తూ వెళ్లింది సుభాషిణి ★



# నేను అందగత్తెనా...

'చాలా మంది మాధురి ముగ్ధమోహనాకారి అంటూ పొగుడుతూ ఉంటారు.. అద్దంలో రోజూ చూసుకునే నాకు నేను అందంగా కనిపించడం లేదు. నాముక్కు చిన్నది..మొహం నిండా మొటిమలున్నాయి..కళ్ళు ఆకర్షణీయమైనవే అయినా చిన్నవిగా కనిపిస్తాయి. నవ్వితే అదోలా ఉంటాను.. ఏడుపు మొహం పెడితే మరీ అసహ్యంగా కనిపిస్తాను..అలాంటి నన్ను అందగత్తె అంటుంటే విడ్డూరంగా ఉంది..!' అంటున్నది మాధురీదీక్షిత్.. 'ఏ అందమూ లేకపోతే వెండితెర మీద కొచ్చి ఉండేదా..?'

-కృష్ణాజీ